క్లుప్తంగా

గంగమ్మకు ప్రత్యేక పూజలు



దూసకల్‌లో చెరువు వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్: మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని చెరువులు అలుగులు పారుతున్నాయి. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామ శివారులో ఉన్న చెరువు అలుగు పారడంతో సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, అగ్గనూరు విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని మొగిలిగిద్ద, కందివనం, ఫరూఖ్‌నగర్, నాగులపల్లి తదితర గ్రామాల్లో చెరువుల వద్ద నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్ష్మీనర్సింహస్వామి గర్భగుడిలోకి వర్షపునీరు



స్వామివారి గర్భగుడిలో వర్షపునీరు

కొందుర్గు: మండల కేంద్రం లోని పెండ్యాల లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయ గర్భగుడిలోకి వర్షపు నీరు చేరుకుంది. పురాతన దేవాలయం కావడంతో పైకప్పు దెబ్బతిని వర్షపునీరు గర్భగుడిలోకి చేరింది. దీంతో స్వామివారికి పూజలు చేయడానికి సహితం వీలు లేకుండా మారిందరి అర్చకుడు రాజేశ్వరస్వామి, దేవాలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య వాపోయా రు. ఎండోమెంట్ అధికారులు స్పందించి దేవాలయాన్ని బాగు చేయించాలని కోరారు.

అలుగుపారిన చెరువులు, కుంటలు

హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



నర్సప్పగూడలో అలుగు పారుతున్న అక్కమ్మ చెరువు

నందిగామ: మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు అలుగుపారాయి. మండల పరిధిలోని నర్సప్పగూడ శివారులోని అక్కమ్మ చెరువు, అప్పారెడ్డిగూడ సమీపంలోని అంచుకుంట చెరువు, నందిగామ శివారులోని చిన్నయ్య చెరువు, మేకగూడ శివారులోని తుంగకుంట, నల్లచెరువు, మొగ్గళ్లకుంట, పీర్లకుంటలు అలుగుపారాయి. దీంతో భూగర్భజలాలు పెరుగుతాయని ఆయా గ్రామాల ప్రజలు, అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



చౌదరిగూడలో బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న నాయకులు

కొందుర్గు: మూడురోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇండ్లు దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని గుర్రంపల్లి, తుమ్మలపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పర్యటించి ఇళ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలకు వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, నాయకులు ఆంజనేయులు, నర్సింలు, చంద్రశేఖర్, వెంకట నర్సింహారెడ్డి, భాస్కర్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో నిదురం ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి రూ.5వేల సాయం ప్రకటించారు. ఈ ఆర్థిక సాయాన్ని సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బుర్రి భూపాల్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో జగన్, నర్సింలు, మహేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి-చేవెళ్ల రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపునీరు



ఫత్తేపూర్ బ్రిడ్జి కింద భారీగా నిలిచిన వర్షపు నీరు

ఆరు నెలలన్నారు.. నాలుగేళ్లయింది!

అసంపూర్తిగా నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

శంకర్‌పల్లి: పట్టణాలు, గ్రామాల రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అధికారులు చెబుతున్నా మాటలు ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. నిత్యం ప్రజలు గుంతల రోడ్లపై అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. రోడ్లపై అడుగడుగునా గుంతలు ఉండడంతో ప్రయాణం నరకయాతనగా మారిందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇది శంకర్‌పల్లి నుంచి వికారాబాద్, చేవెళ్ల వైపు వెళ్లే రోడ్డు పరిస్థితి. ఈ రోడ్డు విస్తరణ పనులను గత ప్రభుత్వంలోనే ప్రారంభించారు. ఈ నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు ఆరునెలల్లో పూర్తి కావాల్సి ఉండగా.. నాలుగేళ్లయినా పూర్తికాలేదు. దీనికి గుత్తేదారు నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. పట్టించుకోవాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు తమకు ఏమి పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

2020 జూన్‌లో శంకుస్థాపన

శంకర్‌పల్లి పట్టణ ప్రధాన చౌరస్తా నుంచి ఫత్తేపూర్ వరకు (వికారాబాద్, చేవెళ్ల వైపు) కిలోమీటరు మేర నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులకు రూ.3.06కోట్లు మంజూరయ్యాయి. దీంతో అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి 2020 జూన్‌లో శంకుస్థాపన చేశారు. ఈ పనులను పూర్తి చేయడానికి సదరు గుత్తేదారునికి ఆర్‌అండ్‌బీ అధికారులు ఆరు నెలలు గరిష్టంగా సమయం ఇచ్చారు. పలు రకాల కారణాలను చూపి మరో ఏడాది కాలం పొడిగించుకొని, పనులను అరకొరగానే చేసి, మధ్యలోనే వదిలేశాడు.

అడుగుకో గుంత.. నిత్యం నరకయాతన

నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులను సదరు గుత్తేదారు సగంలోనే వదిలేయడంతో పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ రహదారి అంతా అడుగుకో గుంత అన్న చందంగా మారింది. నిత్యం ఈ దారిలో వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ముఖ్యంగా చేవెళ్ల, వికారాబాద్ ప్రాంతాల నుంచి రైతులు ఈ రహదారి గుండానే హైదరాబాద్‌కి కూరగాయలను తరలిస్తుంటారు. రాత్రి వేళల్లో గుంతల్లో పడి చాలా మంది ప్రయాణికులు క్షతగాత్రులయ్యారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్నాం

శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా నుంచి ఫత్తేపూర్ వరకు రోడ్డుపై భారీగా గుంతలు పడిన మాట వాస్తవమే. పలుమార్లు మున్సిపాలిటీ నుంచి గుంతల్లో మట్టి వేయించి తాత్కాలికంగా మరమ్మతులు చేయించాం. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్నా సరైన స్పందన లేదు.

– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, శంకర్‌పల్లి

కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు

రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. మిగిలిన బ్యాలెన్స్ పనులను గుర్తించి, మళ్లీ కొత్త టెండర్లను పిలుస్తాం. ఈ ప్రక్రియ అంతా వారం నుంచి 10రోజుల్లో పూర్తి చేసేందుకు కృషిచేస్తున్నాం.

– రమేశ్, డీఈ, ఆర్‌అండ్‌బీ, చేవెళ్ల

బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌రూరల్: బాధిత కుటుంబాలకు సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ఇళ్లు, పంటలు దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నియోజకవర్గంలో వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయిన బాధితులకు ఎమ్మెల్యే నిత్యావసర సరుకులు, రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రకృతి ప్రకోపానికి గురైన బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకొని తక్షణసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బాధితులకు వారంరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. విపత్తులు సహజమని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇళ్లు కూలిపోయిన బాధితులకు పక్కా ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు యాదయ్యయాదవ్, బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, విశ్వం, హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దంగు శ్రీను, అందె మోహన్, సుదర్శన్, ఇబ్రహీం, సీతారాం, ముబారక్, ఖాదీర్, యాదగిరియాదవ్, చంద్రశేఖర్, అప్పి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: మండలంలో ఇళ్లు కూలిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు సోమవారం పరామర్శించారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం వారు నిత్యావసర వస్తువులతో పాటు నగదు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్, జగదీశ్వర్, సురేశ్‌రెడ్డి, తాండ్ర శ్రావణ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీఓ బన్సీలాల్



మాట్లాడుతున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని ఎంపీడీఓ బన్సీలాల్ సూచించారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఎప్పటికప్పుడూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గుంతల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. పురాతన ఇళ్లు కూలిపోయే అవకాశం ఉన్నందున అలాంటి ఇళ్లలో ఎవరిని ఉండనీయకుండా వారికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. వాగుల వద్ద పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితాను వార్డుల వారీగా విభజించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా అధికారులు వాటిని పరిశీలించి త్వరలో తుది జాబితాను ఆమోదిస్తారని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ జయంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తేజస్విని, అనిల్‌కుమార్, రఘు, బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

కేశంపేట: హాస్టల్‌తో పాటు పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తహసీల్దార్ అజీంఅలీ అన్నారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామంలో ఉన్న కేజీబీవీని సోమవారం తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో తరగతి గదులతో పాటు, హాస్టల్ గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తాజా కూరగాయాలను వంటలకు వినియోగించాలని ఎస్‌ఓ గౌసియాబేగంకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత మధుసూదన్‌రెడ్డి

చేవెళ్ల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న ఆలయానికి చేవెళ్లకు చెందిన దాత గుడుపల్లి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు మధుసూదన్‌రెడ్డి 25 వేల 116 రూపాయల విరాళం అందజేశారు. సోమవారం ఆలయం వద్ద ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులైన కురుమ సంఘం నాయకులకు మధుసూదన్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా దేవాలయానికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఆలయాల నిర్మాణాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాధితులకు నగదు అందజేస్తున్న నాయకులు

కొత్తూరు: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లు కూలిపోయిన ఇద్దరు బాధితులకు కాంగ్రెస్ నేతలు సోమవారం ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని కొడిచర్లకు చెందిన దాసరి ప్రశాంత్, కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌కు చెందిన యాదయ్యలకు చెందిన ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో తక్షణ సాయంగా ఇద్దరికి రూ.10వేల చొప్పున నగదు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జే.సుదర్శన్‌గౌడ్, సురేందర్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, ఇందూరి శ్రీను, రాములు, శివకుమార్‌గౌడ్, ఏనుగు జనార్ధన్‌రెడ్డి, గోవింద్‌నాయక్, మల్లికార్జున్‌రెడ్డి, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీని ప్రశాంతంగా జరుపుకోవాలి

ఏసీపీ శ్రీనివాస్‌రావు



ముస్లింలకు సూచనలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

కొత్తూరు: మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు. ఇందులో భాగంగా ఆయన సోమవారం ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జేపీ దర్గాలో పర్యటించారు. పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ర్యాలీ, వేడుకలు జరుపుకోవాలని ముస్లింలకు సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలిగేలా, ఉద్దేశపూర్వకంగా ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ నర్సింహరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చేవెళ్ల: మండలంలోని కొనగట్టు శివాలయంలో శ్రావణమాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శివలింగానికి అభిషేకాలు చేశారు. శ్రావణమాసం ప్రత్యేక పూజలతో నెలరోజులుగా భక్తులు పూజలు కొనసాగిస్తూ వచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు ఉన్నారు.

హైడ్రాను విమర్శించడం సరికాదు

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు



మాట్లాడుతున్న బక్కని నర్సింలు

షాద్‌నగర్: సహజ సంపదను కాపాడేందుకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని, హైడ్రా చేస్తున్న పనులను కొందరు నాయకులు విమర్శించడం సరికాదని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న వీరమోని చెరువు నీటి ప్రవాహానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ప్రహరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న వీరమోని చెరువు ప్రవాహానికి అడ్డుగా ఓ వ్యాపారి ప్రహరీ నిర్మించాడని, నీటి ప్రవాహాన్ని అడ్డుకునే విధంగా ప్రహరీని నిర్మించడం సరికాదన్నారు. ఈ విషయంలో ఇప్పటికే గ్రామ పంచాయతీ వారు నోటీసులు జారీ చేశారన్నారు. అదేవిధంగా ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. భావితరాలకు ఉపయోగపడే సహజ వనరులను నాశనం చేసే హక్కును ఎవరిచ్చారన్నారు. కొందరు వ్యాపారులు, అధికారులతో కుమ్మక్కై చెరువులు, కుంటలను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కట్టడాలు నిర్మించారన్నారు. సహజ వనరులను, సంపదను కాపాడేందుకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. హైడ్రా అధికారులు తమ విధులను నిర్వహిస్తుంటే నాయకులు విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీష్వరామకృష్ణ, కౌన్సిలర్ బచ్చలి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకోవాలి

మండల వ్యవసాయాధికారి వాణి



వీర్లపల్లిలో కుటుంబ సభ్యుల నిర్ధారణ పత్రాలను పరిశీలిస్తున్న వాణి

నందిగామ: పంట రుణాలు తీసుకున్న రైతుల్లో రుణమాఫీ కాలేనివారు తప్పనిసరిగా కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వాణి అన్నారు. మండల పరిధిలోని వీర్లపల్లిలో సోమవారం రైతులకు సంబంధించిన కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కుటుంబ సభ్యుల నిర్ధారణకు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఏఓ వాణి మాట్లాడుతూ.. రుణమాఫీ కాలేని రైతులు ఆందోళన చెందొద్దని, అలాంటి వారికోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. రైతులు తమ భార్యాభర్తల ఆధార్ కార్డుల జిరాక్స్, పిల్లల ఆధార్‌కార్డుల జిరాక్స్ కాపీలతో పాటు ధ్రువీకరణ పత్రంపై కుటుంబ యజమాని సంతకం చేసి ఇవ్వాలని సూచించారు. ఈ ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం రైతు కుటుంబ సభ్యులతో మండల వ్యవసాయాధికారి ఫొటో దిగి యాప్‌లో అప్‌లోడ్ చేస్తామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతు ఆధార్‌కార్డులోని పేరు, బ్యాంకు ఖాతాలోని పేరు వేర్వేరుగా ఉన్నా, ఏమైనా తప్పిదాలు ఉన్నట్లయితే వెంటనే రుణం తీసుకున్న బ్యాంకును సంప్రదించాలని, తప్పిదాలను సరిచేసుకునేందుకు ఈ నెల 6వ తేదీ వరకు ఉందని ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవికుమార్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

మొయినాబాద్‌రూరల్: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కనకమామిడి మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల్లో రుణమాఫీ కాని రైతులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల కుటుంబ నిర్ధారణతో పాటు ఆధార్ కార్డు లింకేజీ, తీసుకున్న రుణాలు అధికంగా ఉంటే వాటిని పరిశీలిస్తూ ఆన్‌లైన్ నిక్షిప్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 2 లక్షలు రుణాలు తీసుకున్న వారికి తప్పనిసరిగా రుణమాఫీ జరుగుతుందని సూచించారు. రెండు లక్షలు తీసుకున్న వారు వాటికి వడ్డీ పెరిగితే వాటిని కట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వడ్డీ చెల్లిస్తేనే ఈ రుణమాఫీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

షాద్‌నగర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు సూచించారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలుర వసతి గృహంలో వంద మందికి పరీక్షలు నిర్వహించగా నలుగురు విద్యార్థులకు జ్వరం, 8 మందికి జలుబు ఉన్నట్లు గుర్తించి మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా ఎస్సీ బాలిక వసతి గృహంలో ఇద్దరు విద్యార్థులకు జ్వరం, 5 మందికి జలుబు ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండడంతో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమ కాటు ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను విధిగా పాటించాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే హాస్టల్ వార్డెన్‌కు చెప్పి వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయా హాస్టళ్లలో వంట గదులను పరిశీలించి వంట పాత్రలను ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు నాగేంద్రబాబు, జగదీశ్వర్, వార్డెన్‌లు రాజు, సులోచన, ఏఎన్ఎంలు లక్ష్మి, మంజుల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వైఎస్సార్



చేవెళ్ల: చేవెళ్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



కొందుర్గు: చౌదరిగూడలో..

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పల్లె ప్రజల కష్టాలు తెలిసిన వైఎస్సార్ పేద ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల పక్షపాతిగా, రైతుబిడ్డగా ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానం సంపాదించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. ఈ సందర్భంగా షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్ఆర్ పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచాడని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు వైఎస్సార్ చేసిన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



షాబాద్‌లో..